# ఆర్టీసీ బస్సులో కండక్టర్‌పై దాడి

- **లోపలికి వెళ్లమని చెప్పగా దుర్భాషలాడి చెప్పలేపిన ప్రయాణికురాలు**
- **అనంతరం బస్సు దింపగా మల్లంపల్లిలో ఒకరితో బైక్‌పై వచ్చి దాడి**



బస్సు కండక్టర్‌పైకి చెప్పు లేపిన ప్రయాణికురాలు

ములుగురూరల్, జూలై 31: మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు ప్రాణ గండంగా మారుతోంది. తాజాగా ములుగు జిల్లా ములుగు మండలం మల్లంపల్లిలో ఇలాంటి ఘటన బుధవారం జరిగింది. బాధిత కండక్టర్ సీహెచ్ కమలాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-2 డిపోకు చెందిన టీజీ03 టీ0459గల ఎక్స్‌ప్రెస్ బస్సులో హైదరాబాద్ నుంచి ఏటూరునాగారానికి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వస్తోంది. వరంగల్ జిల్లా ఆత్మకూరులో బస్సు ఆగిన అనంతరం ఓ మహిళ ఎక్కింది. అప్పటికే బస్సులో 75 మంది ప్రయా ణికులు ఉండగా, సీట్లు లేకపోవడంతో ఆమె డ్రైవర్ పక్కన ఉన్న గేర్‌బాక్స్‌పై కూర్చుంది. డ్రైవర్ కార్తీక్ బస్సు లోపలికి వెళ్లాలని సూచించినా వినకుండా దుర్భాషలాడింది. దీంతో ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళపై ఫిర్యాదు చేసి బస్సు దింపించారు. ప్రయాణికులతో బస్సులో వస్తుండగా ములుగు మండలం మల్లంపల్లి వద్దకు రాగానే ఆమెను బైక్‌పై తీసుకొచ్చిన ఓ వ్యక్తి బస్సును ఓవర్ టేక్ చేసి ఆపాడు. వెంటనే బస్సులోకి వచ్చిన మహిళ కండక్టర్‌ను చెప్పుతో కొడుతుండగా మరో మహిళ ఆపింది. మహిళతో వచ్చిన వ్యక్తి కండక్టర్‌పై పిడి గుద్దులు గుద్ది వెళ్లిపోయాడు. బస్సు ములుగు బస్టాండ్‌కు వచ్చిన అనంతరం కంట్రోల్ మోహన్‌కు డ్రైవర్ కార్తీక్, బాధిత కండక్టర్ విషయాన్ని తెలియజేశాడు. దీంతో ఆయన సదరు మహిళ, ఆమెతో వచ్చిన వ్యక్తిపై ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న

# అక్కలు అంటే అంత అలుసా..

- **సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలి**
- **ఎల్‌హెచ్‌పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న**

మహబూబాబాద్ రూరల్, జూలై 31 : 'అక్కలు ఓట్లు వేస్తేనే సీఎం కుర్చీలు కుర్చున్నావు.. అక్కలు అంటే అంత అలుసా అని లంబాడీ హక్కుల పోరాట సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ధరంసోత్ స్వప్న అన్నారు. బుధవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన మహిళా విభాగం సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, వారి ఆత్మ గౌరవం దెబ్బతీసేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యావత్ మహిళా లోకాన్ని కించపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా నాయకులు మూడ్ ద్వాలి, నీల బాయి, ప్రియాంక, కమిలి, బుజ్జి, సోని బాయి తదితరులు పాల్గొన్నారు.

















